# 10. విముక్తి

చేతకాని దానిలా మనసుకు నచ్చనిదాన్ని భరిస్తూ కూర్చోవాల్సిన అవసరం కనబళ్ళేదు నాకు.

ఒక్క వుదుటున లేచి వినీత్ ముందుకి వెళ్ళి నిల్చుని "నాకు క్రొత్త మానిటర్ కావాలి." అన్నాను.

వినీత్ తలెత్తి చూసి "ప్రియనడగలేదా!" అన్నాడు.

నేను నా అసహనాన్ని ఏమాత్రం దాచుకోకుండా నొసలు విరిచి చూస్తూ "అడిగాను" అన్నాను విసుగు ధ్వనించే గొంతుతో.

నేనింకేమీ చెప్పకుండానే తనకంతా అర్థమయినట్లు వినీత్ నవ్వాడు.

అరగంట తర్వాత వినీత్ యిప్పించిన క్రొత్త మానిటర్ కనెక్ట్ చేసుకుంటూంటే.. ప్రియ అటువైపు వచ్చింది.

"నేను నా కాంటాక్ట్స్ వుపయోగించి తెచ్చుకున్నాను." అన్నాను తనని ఓరకంట చూస్తూ.

"గుడ్" అంది ప్రియ చిరునవ్వుతో.

ప్రియ, వినీత్ యిద్దరూ ప్రాజెక్ట్ మానేజర్స్. నేను యిద్దరి ప్రాజెక్ట్స్ లోనూ పని చేస్తున్నాను. డైరెక్ట్‌గా రిపోర్ట్ చేసేది ప్రియకే. కానీ కొంత సమయాన్ని వినీత్ ప్రాజెక్ట్‌కి కూడా కేటాయించాలి.

మామూలుగానే యిద్దరు వ్యక్తుల ఆధ్వర్యంలో పనిచేయడం కష్టం. అందులోనూ వీళ్ళిద్దరూ భిన్న ధ్రువాలు. వినీత్ ఎంత ఫాస్టో ప్రియ అంత నెమ్మది. నెమ్మది అంటే నెమ్మదీ కాదు. ప్రియని ఎలా నిర్వచించాలో నాకు అర్థం కాదు. ప్రశాంతం అనాలేమో! అలా అంటే వినీత్ కూడా అగ్నిగుండమేమీ కాదు. నిజానికి వినీత్ చాలా సరదాగా వుంటాడు. ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ వుంటాడు.

ప్రియ.. ప్రియ కూడా ఏడుస్తూ ఏమీ వుండదు. ఎప్పుడూ తన మొహంలో చిరుకోపం కూడా కనిపించదు.



నేను తల విదిలించాను. వీళ్ళిద్దరికీ చాలా తేడా వుంది. కానీ ఆ తేడా ఏమిటో స్పష్టంగా అర్థం కావడం లేదు.

ఇప్పుడు.. ఈ మానిటర్ సంగతే చూస్తే.. నా కంప్యూటర్‌కి వున్నది పాత మానిటర్.

కంపెనీలో పాతవన్నీ రీప్లేస్ చేసి క్రొత్త ఎల్.సి.డి మానిటర్స్ పెడుతున్నారు. క్రొత్తవి రాగానే హుషారుగా వుండే మానేజర్స్ ముందు తమ గ్రూప్‌మెంబర్స్‌కి యిప్పించేసుకుంటున్నారు. వినీత్ తన టీమ్‌మెంబర్స్ అందరికీ వారం క్రిందటే, ఫస్ట్ సెట్ వచ్చినపుడే యిప్పించేశాడు.

ప్రియకి ఆ హడావుడీ, ఆరాటం లేవు. వచ్చినవి వచ్చినట్లు అందరూ తీసేసు కుంటుంటే మాట్లాడకుండా కూర్చుంటుంది. అదేమంటే "అన్నీ మారుస్తారు జయంతీ! తొందర పడాల్సింది ఏం లేదు. ఒకరోజు అటూ యిటూ అంతే కదా!" అంది.

అందుకే యిక ప్రియతో పెట్టుకుంటే లాభం లేదని వినీత్‌ని అడిగి నా సంగతి నేను చూసుకున్నాను. ప్రియని రెచ్చగొట్టడానికే 'నా కాంటాక్ట్స్ వుపయోగించి తెచ్చుకున్నాను' అని చెప్పాను. 'నీకు ఆమాత్రం చేతకాలేదు కదా' అని డైరెక్ట్‌గా అనలేక.

ప్రియకి కోపం వచ్చిందేమో! ఇవాళ త్వరగా వెళ్ళడానికి పర్మిషన్ అడగాలి. ఏమంటుందో! వినీత్ ప్రాజెక్ట్ పూర్తయింది. ఇవాళ పార్టీ వుంది. సాయంత్రం టీమ్ అంతా డిన్నర్‌కి వెళ్తున్నాం.

"నేను నాలుగింటికి వెళ్ళిపోతాను ప్రియా!" అన్నాను, తన సీట్ దగ్గరికి వెళ్ళి.

"పార్టీ వున్నట్లుంది కదా! వెళ్ళడం లేదా!" అంది ప్రియ.

"పార్టీ కోసమే. ఇంటికి వెళ్ళి రెడీ అయి వద్దామని" అన్నాను.

ప్రియ ఏదో అనబోయి వూరుకుంది. సరేనన్నట్లు తలవూపింది.

చాలా నీరసంగా తల తిరుగుతున్నట్లుగా వుంది. ఇంటిదాకా వెళ్ళి మళ్ళీ రావాలంటే విసుగ్గా వుంది కానీ తప్పదు.

ట్రాఫిక్‌లో టూ వీలర్ మీద ప్రయాణం కంటే నరకం లేదు. ఇంటికి వెళ్ళి రెడీ అయ్యి, బండి యింట్లోనే వుంచేసి ఆటోలో మళ్ళీ ఆఫీస్‌కి వచ్చాను.

నేను వచ్చేసరికి అందరూ యింకా పనుల్లోనే వున్నారు. ప్రియ యింటికి వెళ్ళేందుకు బయలుదేరుతోంది.

ఉస్సురంటూ కుర్చీలో కూలబడి "నా పని అయిపోయింది" అన్నాను. ప్రియ అర్థం చేసుకున్నట్లుగా చూసి "ఇక్కడే కాస్త మొహం కడుక్కుని వెళ్ళిపోవలసింది. నేను చెప్దామనుకుని కూడా మళ్ళీ నీకు యింట్లో ఏమన్నా పనుందేమోనని వూరుకున్నాను" అంది.

నా అలసట మర్చిపోయి నేను ప్రియవైపే తదేకంగా చూశాను. నేను ఇందాక ఎలా వున్నానో... యింటికి వెళ్ళి ఎంత బాగా తయారయి వచ్చానో.. ఆ తేడా అసలు తనకి ఏమన్నా అర్థమయిందా లేదా అనిపించింది. నేను కట్టుకు వచ్చిన క్రొత్తరకం చీర.. జ్యుయలరీ.. యివన్నీ తనకసలు కనబడుతున్నాయా! లేదా!

ప్రియ ఎపుడూ ఒకేరకంగా తయారవుతుంది. కడితే సెమీగద్వాల్ చీరలు... లేదంటే బెంగాల్ కాటన్ చీరలు. మెడలో మంగళ సూత్రాల గొలుసు. నల్లపూసలు. అంతే.

ఏడున్నర అవుతూండగా అందరం బయల్దేరాం. నేను, దీప్తి, ప్రభ వినీత్ కార్లో సర్దుకున్నాం. మిగతావాళ్ళందరూ ఎవరి వెహికిల్స్‌లో వాళ్ళు బయల్దేరారు.

వినీత్ హైదరాబాదులోని రెస్టారెంట్లన్నిటినీ వర్ణిస్తూ ఎక్కడ ఏం బాగుంటుందో చెప్తుంటే.. "తరచుగా బయటికి వెళ్తూంటారా!" అన్నాను.

"ఊ. ప్రతి సాటర్‌డే బయటే డిన్నర్ చేస్తాం. మేము వెళ్ళని రెస్టారెంట్ లేదు హైదరాబాదులో" అన్నాడు.

"ఇంటికెళ్ళి వచ్చావా జయంతీ!" అంది ప్రభ నా చీరనీ, అలంకరణనీ చూస్తూ. నేను తల వూపుతుంటే "నైస్ శారీ" అని అభినందించింది.

"నీరూస్‌లో కొన్నానన్నావు ఇదేనా!" అంది దీప్తి.

"అవును." అన్నాను.

డ్రైవ్ చేస్తూనే వినీత్ ఒకసారి నావైపు చూశాడు.

"బంజారాహిల్స్ లో ఏదో షాప్ పేరు చెప్పిందే మా కజిన్. అక్కడ డ్రెసెస్ చాలా బాగున్నాయంట." అంది ప్రభ.

"అవును నేను కూడా విన్నాను." అంది దీప్తి. ప్రభా, దీప్తీ షాపు పేరు గుర్తు తెచ్చుకునేందుకు కష్టపడుతుంటే... "రంగోలి నా!" అన్నాడు వినీత్.

ముగ్గురం అతనివైపు నవ్వుతూ చూశాం. ఇతనికి తెలియని విషయం లేదా! అనిపించింది. జీవితాన్ని ఆనందించడం అంటే ఏమిటో వినీత్ దగ్గరనుంచే నేర్చుకోవాలనిపించింది.

రెస్టారెంట్‌లో కూడా చాలా సరదాగా గడిచింది. భోజనం పూర్తి చేసి బయటికి రాగానే "నువు మళ్ళీ వినీత్ కార్లోనే వెళ్ళచ్చు. అటువైపే కదా తను వెళ్ళేది!" అన్నాడు కిషోర్.

"ఎక్కడ మీరుండేది!" అన్నాడు వినీత్ నా వైపు చూస్తూ.

నేను నోరు తెరిచేలోపే కిషోర్ హుషారుగా నా వివరాలన్నీ చెప్పేశాడు. కిషోర్ మేము ఇల్లు కొనుక్కున్నపుడు గృహ ప్రవేశానికి వచ్చాడు. వినీత్ అప్పుడు వేరే డిపార్ట్‌మెంట్‌లో వుండేవాడు కనుక అతన్ని పిలవలేదు.

తనకన్నా చాలా జూనియర్‌ని అయిన నేను అంత ఖరీదయిన ఫ్లాట్స్‌లో వుంటానని వూహించలేదేమో వినీత్ ఆశ్చర్యంగా చూశాడు.

ఎప్పుడు కొన్నామో, ఎంతకి కొన్నామో అడుగుతూంటే కిషోర్ అతని ఆశ్చర్యాన్ని గ్రహించినట్లూ "తనకేంటి వినీత్! వాళ్ళాయన బోల్డంత సంపాదిస్తున్నాడు" అన్నాడు నవ్వుతూ.

"ఏం చేస్తారు మీ హజ్‌బెండ్!" వినీత్ ఆసక్తిగా అడిగాడు.

మనోహర్ జాబ్ గురించి చెప్పాను.

"అబ్బో!" అన్న ఎక్స్‌ప్రెషన్‌తో చూశాడు.

వచ్చేటపుడు ఎందుకో వినీత్ వెళ్ళేటపుడున్నంత హుషారుగా కనిపించలేదు. అసహనంగానూ, ఆలోచనలో పడిపోయినట్లుగానూ అనిపించాడు.

కొంచెం యివతలికి రాగానే కారు వేరే వైపు తిప్పి "నాకు మంచి పాన్ తినాలనిపిస్తోంది." అన్నాడు.

ఒక పదినిమిషాలు ప్రయాణించాక కారు ఒక ప్రక్కకి ఆపి, "ఒక్క నిమిషం" అంటూ తను దిగి వెళ్ళాడు.

పాన్ కోసం యింత దూరం రావాలా! అనుకున్నాను నేను కార్లో కూర్చుని. కానీ అతను తిరిగొచ్చాక అర్థమయింది, ఆ పాన్ ప్రత్యేకత ఏమిటో! నిజంగా చాలా బాగుంది. ఆ షాప్ చాలా ఫేమస్ అట. అక్కడి పాన్ కోసం చాలా గొప్ప గొప్ప వాళ్ళు కూడా వస్తారట. వినీత్ చెప్తూంటే ఎపుడో పేపర్లో చదివినట్లు గుర్తొచ్చింది.

"ఏ విషయంలోనూ కాంప్రమైజ్ అవరు కదా మీరు!" అన్నాను అతన్ని ప్రశంసగా చూస్తూ.

చిరుగర్వంతో నవ్వాడు వినీత్. "చేతిలో కారుంది. జేబులో డబ్బులున్నాయ్. మనసుకు నచ్చింది చేయకుండా బాధపడడం ఎందుకు!" అన్నాడు.

నేను పాన్ నములుతూ అవునన్నట్లు తలవూపాను.

రాత్రంతా అలా ఆనందంగా గడిచింది కానీ ప్రొద్దున్నే లేచేసరికి విపరీతమైన నీరసంగా అనిపించింది.

ఆఫీసుకి వెళ్ళకుండా హాయిగా దుప్పటి ముసుగు పెట్టుకుని పడుకోవాలనిపించింది. కానీ ప్రియ ప్రాజెక్ట్‌లో నా పని చాలా వెనుకపడింది. నిన్ననే చెప్పింది ప్రియ యివాళ అదంతా పూర్తి చేయాలనీ... లేకపోతే ప్రాజెక్ట్ అనుకున్న టైమ్‌కి అవదనీ.

ఈసురోమంటూ లేచి తయారయ్యాను. ట్రాఫిక్‌లో నుంచి బయటపడేసరికి నా బాధ పరాకాష్ఠకి చేరింది.

ఆఫీస్‌కి వస్తూనే సీట్లో కూలబడిపోయాను. ప్రియ వచ్చి ఏదో చెప్పబోతే "నాకు గుర్తుంది. ఇవాళ కంప్లీట్ చేస్తాను." అని చెప్పాను విసురుగా. 'పూర్తి చేసి మీ మొహాన కొడతాను' అన్నంత తీవ్రంగా.

ప్రియ నావైపు ఒకసారి పరీక్షగా చూసి వెళ్ళిపోయింది. ఒక్కక్షణం బాధగా అనిపించింది, 'పాపం పెద్దా చిన్నా లేకుండా కసురుకున్నానా!' అని. కానీ ఏం చేయను! నాకసలు యివాళ మనసు మనసులో లేదు. ఏమిటో ఆరాటంగా వుంది.

కంప్యూటర్ ఓపెన్ చేయగానే కిషోర్ మెయిల్ కనిపించింది. ప్రియకు రాసిన మెయిల్ మా అందరికీ కాపీ పెట్టి వుంది.

"... మనసులో ఒకటి పెట్టుకుని పైకి మరొకటి మాట్లాడటం నాకు అలవాటు లేదు. అలా చేసినందువల్ల ఆనందం వుంటుందని నేను నమ్మను.." ఈ ధోరణిలో సాగిన మెయిల్ చూస్తే నాకేం అర్థం కాలేదు.

ఎందుకిలా వ్రాశాడా అని క్రిందకి చూస్తే.. గంట క్రితం ప్రియ కిషోర్‌కి వ్రాసిన మెయిల్ కనిపించింది. ఒక మాట మాట్లాడేముందు ఆలోచించి మాట్లాడాలనీ... మనసులో ఏమనిపిస్తే అది పైకి అనేయకూడదనీ..

ప్రియ మెయిల్ చదివితే యింకాస్త అయోమయంగా అనిపించింది. 'ఇదేమిటి! ప్రియ ఎప్పుడూ ఎవరికీ యిలాంటి బోధలు చేయదే!' అనుకుంటూ యింకొంచెం క్రిందికి స్క్రోల్ చేస్తే మళ్ళీ కిషోర్ వ్రాసిన మెయిల్ కనబడింది.

భాస్కర్‌కి వ్రాశాడు కిషోర్ ఆ మెయిల్. అది చదివాక విషయం మొత్తం అర్థమయింది.

భాస్కర్ మా ప్రాజెక్ట్‌లో అందరికన్నా సీనియర్. అతనికి త్వరలో ప్రాజెక్ట్ మానేజర్‌గా ప్రమోషన్ కూడా రాబోతోంది.

రకరకాల బంద్‌ల వల్ల ఈవారం పని సరిగా నడవలేదు. అందుకని రేపు శనివారం అందరం ఆఫీస్‌కి వచ్చి పని పూర్తి చేద్దామన్నాడు భాస్కర్. దానికి కిషోర్ "అపుడే మానేజర్ బుద్ధులు బయట పెట్టుకుంటున్నావా! నీకొక్కడికీ వీలయితే సరిపోతుందా! మా అందరి సంగతీ ఆలోచించనక్కర్లేదా!" అంటూ మెయిల్ వ్రాసి ప్రియతో సహా మా టీమ్ మొత్తానికీ దాన్ని కాపీ చేశాడు.

దానికే ప్రియ రిప్లై యిచ్చింది. భాస్కర్ ఏదో మామూలుగా అన్నదానికి అంత విపరీతార్థాలు తీయనక్కరలేదనీ... ఆవేశంలో ఏదంటే అది మాట్లాడి, అవతలి వారి మనసుని బాధపెడితే.. ఆ తర్వాత మనకి మనశ్శాంతి వుండదనీ... యిలా పెద్దమనిషి తరహాగా ఏదో వ్రాసింది.

దానికి కిషోర్ "మీ సలహాకి థ్యాంక్స్. కానీ నామటుకు నాకు మనసులో వున్నదేదో పైకి అనేస్తేనే హాయిగా వుంటుంది. అనకుండా దాచుకుంటేనే బాధగానూ.. మనసుమీద వత్తిడిగానూ వుంటుంది." అని సమాధానమిచ్చాడు.

కిషోర్ వ్రాసిన తీరుకీ.. ముఖ్యంగా ప్రియకి అంత పదునుగా సమాధానం చెప్పినందుకూ నాకు నవ్వొచ్చింది కానీ... భాస్కర్ గురించి కిషోర్ అలా అనడం కూడా కరెక్ట్ కాదనిపించింది.

నిజమే. పాపం భాస్కర్ మామూలుగా పనంతా ఆగిపోయిందన్న బాధలో ఏదో సలహా చెప్పాడు. అంతేకానీ శనివారం రావాలన్న నిర్ణయమేమీ జరిగిపోలేదు. కిషోర్ అంత ఆవేశపడి అలా వ్రాయకుండా వుండాల్సింది. వ్రాసినా... మొత్తం టీమ్ అందరికీ కాపీ చేయకుండా వుండాల్సింది. వయసులో పెద్దవాడన్న గౌరవమన్నా వుండాలి కదా!

కాసేపటి క్రితం నేనూ ప్రియని అలాగే కసురుకున్నానని గుర్తొచ్చింది. లేచి తన సీట్ దగ్గరికి వెళ్ళాను. ఏవో సందేహాలు అడిగినట్లు కాసేపు అవీ యివీ మాట్లాడి.."ప్రొద్దున పూట చాలా ట్రాఫిక్ వుంటోంది ప్రియా. ఆ ట్రాఫిక్‌లో ఆఫీస్‌కి వస్తే పిచ్చెక్కుతోంది. ఎదురుగా కనిపించిన వాళ్ళని కొట్టాలన్నంత కోపం వస్తోంది." అన్నాను.

డైరెక్ట్‌గా క్షమార్పణ చెప్పకుండా... డొంక తిరుగుడుగా నేనిచ్చిన సంజాయిషీకి ప్రియ చిరునవ్వు నవ్వింది. "అలా అనిపిస్తే ఎలా! అనిపించకుండా చూసుకోవాలి." అన్న అర్థం కనిపించింది నాకా నవ్వులో.

వెనక్కి వచ్చి పని మొదలు పెట్టాను. సాయంత్రం వరకూ కదలకుండా కూర్చుని

పని పూర్తి చేశాను. మధ్యలో లంచ్ టైమ్ లో ఓ పావుగంట భోజనానికి లేచానంతే.

సాయంత్రం టీ త్రాగుదామని క్యాంటీన్‌కి వెళ్తే వినీత్ కనిపించాడు. మేము కూర్చున్న రెండు నిమిషాలకే ప్రియ కూడా వచ్చింది.

మేమున్న టేబుల్ దగ్గరకే వచ్చి కూర్చుంటూ "నెక్ట్స్ వీక్ సెలవు పెడుతున్నారా వినీత్" అని అడిగింది.

వినీత్ తల వూపాడు. "అవును. కాశ్మీర్ వెళ్తున్నాం" అన్నాడు.

"కాశ్మీరా!" అన్నాను నేను ఉద్వేగంగా.

"పర్లేదా! అక్కడేం గొడవలు వుండవా!" నేను ఆసక్తిగా అడిగితే వినీత్ నవ్వాడు.

"ప్రాబ్లమ్స్ వున్నా మీరు పట్టించుకోరు కదా! ఏం చేయాలనుకుంటే అది చేసేస్తారు." అన్నాను ప్రశంస నిండిన కంఠంతో.

"అవును. మనసుకు నచ్చిన ప్రతిదీ సాధించుకోవడానికి ప్రయత్నించాలనేది నా సిద్ధాంతం." ఒకరకమైన స్టైల్‌తో చెప్పాడు వినీత్, ప్రియ వైపు చూస్తూ.

అవుననలేదు, కాదనలేదు ప్రియ. 'ఏమంటారు!' అన్నట్లుగా చూస్తున్న వినీత్‌కి సమాధానంగా ఆమె పెదవుల మీద సన్నటి నవ్వు విరిసింది.

వాళ్ళిద్దరినీ గమనిస్తూన్న నాకు మళ్ళీ ఒక్కసారిగా తల తిరుగుతూన్నట్లూ... వాంతి అయ్యేట్లూ అనిపించింది.

ఒక్క క్షణం కళ్ళు మూసుకుని, తేరుకునే ప్రయత్నం చేశాను. "ఏంటి జయంతీ! ఒంట్లో బాగాలేదా!" అంది ప్రియ.

"బానేవుంది" కళ్ళు తెరిచి నవ్వుతూ చెప్పాను. "వారం రోజుల నుంచీ కాస్త శ్రమ ఎక్కువయింది. లాస్ట్ వీక్ అంతా మా అత్తగారు వాళ్ళు ఉన్నారు. ఆఫీస్‌లో పని. మళ్ళీ యింటికి వెళ్తూనే రెస్ట్ లేకుండా పని. ఇంటికి వెళ్ళగానే కాఫీ త్రాగుతూ ఒక అరగంట సేపు స్తిమితంగా కూర్చోవాలని అనిపిస్తుంది నాకు. ఇంట్లో ఎవరైనా వుంటే అలా కుదరదు కదా!" అన్నాను.

"అలాంటపుడు యిక్కడే రిలాక్స్ అయి వెళ్ళాలి." అన్నాడు వినీత్. "ఆఫీస్‌లో పని అయిపోగానే... ఇక్కడే ఓ అరగంటో గంటో రెస్ట్ తీసుకుని, రిలాక్స్ అయ్యి యింటికి వెళ్ళాలి. ఆడవాళ్ళందరూ చేసే పొరపాటు అదే. అనవసరపు భేషజాలకు పోయి.. ఎవరో ఏదో అనుకుంటారని మనసుని నిగ్రహించుకోవడం... ఒత్తిళ్ళు పెంచుకోవడం చేస్తే ఆరోగ్య సమస్యలొస్తాయి."

నేను చప్పున తలెత్తి వినీత్ మొహంలోకి చూశాను. నాకు సలహా యిస్తున్నాడా! ప్రొద్దున కిషోర్‌కి ప్రియ చెప్పిన విషయాన్ని ఎత్తి చూపుతున్నాడా అని సందేహం వచ్చింది నాకు.

"అందుకే నేను నా టీమ్ మెంబర్స్‌కి ఎపుడూ చెప్తుంటాను. మనసు మీద అనవసరంగా కంట్రోల్స్ పెట్టొద్దని."

వినీత్ ముక్తాయింపు వినగానే నాకర్థమయింది. ప్రొద్దుటి విషయమే మాట్లాడుతున్నాడతను.

ప్రియ కూడా అర్థం చేసుకున్నట్లుంది. అయినా చెక్కు చెదరని చిరునవ్వుతో "నిగ్రహం సమస్య కాదు వినీత్. పరిష్కారం." అంది.

"అదే చెప్తున్నాను. చేతకాని వాళ్ళు ఆలోచించే ధోరణి అది. మనసుకు నచ్చినవన్నీ సాధించేందుకు ప్రయత్నిస్తే అందుకు తగినట్లుగా మన సామర్థ్యం పెరుగుతుంది. అప్పుడు అసమర్థుల్లా మాట్లాడం" అన్నాడు వినీత్.

"ఇందులో రెండు విషయాలున్నాయి. మనసుకు నచ్చినవి సాధించే క్రమంలో కూడా మనసుకు నచ్చని పనులు కొన్ని చేయాల్సి వస్తుంది. అదొకటి. రెండోది.. నచ్చినవన్నీ సాధించడమంటే ఎన్నని సాధిస్తారు!" ప్రియ అడిగింది.

"ఎన్నైనా!"

"ఎక్కడో ఒకచోట ఆగాల్సి వస్తుంది."

"రాదు. అయినా ఎపుడో ఆగాల్సొస్తుందని మొదలే పెట్టకపోవడం ఫూలిష్‌నెస్" ఖచ్చితంగా చెప్పాడు వినీత్.

నేను ప్రియవైపు తిరిగి "అలా అనుకుంటూ కూర్చుంటే అసలు యిక లైఫ్‌లో మనం ఏం చేస్తాం ప్రియా! ఏదన్నా కావాలనుకుంటే దానికోసం కష్టపడి పనిచేస్తాం. వద్దనుకుంటే యింకేం చేస్తాం!" అన్నాను.

ప్రియ నవ్వి "అప్పుడు యింతకు మించినవి చేస్తామేమో!" అంటూ లేచింది. మాకూ సంభాషణ ఆపి లేవక తప్పలేదు.

మొత్తానికి ప్రియ ప్రాజెక్ట్‌లో ఈ వారానికి నాకు అప్పగించిన పని పూర్తి చేసి ఆఫీస్ నుంచి బయల్దేరాను. ఇవాళ అమ్మా వాళ్ళింటికి వెళ్తానన్నానని మనోహర్ కారు పంపించాడు.

పార్కింగ్ ప్లేస్ వైపు నడుస్తూంటే వినీత్ కనబడి "పాస్‌పోర్ట్ రెడీగా వుంది కదా నీకు!" అని అడిగాడు.

"నెక్స్ట్ ప్రాజెక్ట్ కోసం ఆన్‌సైట్‌కి వెళ్ళాలంటే వెళ్తావా వన్ యియర్!" అన్నాడు.

"ఎప్పుడు!" ఆనందంతో నా గుండె వేగం పెరిగింది.

"ఇంకొక మూడు నెలలలో."

అప్రయత్నంగా తల వూపాను.

కార్లో కూర్చుని డ్రైవర్‌తో "అమ్మావాళ్ళింటికి" అంటున్నప్పుడు గుర్తొచ్చింది అక్కడికి వెళ్తున్న కారణం. దానితోపాటూ ఆన్‌సైట్‌కి వెళ్ళడం కుదరదేమోనన్న ఆలోచనా మనసుని కుదిపేసింది.

రెండ్రోజుల క్రితం పీరియడ్స్ లేట్ అయ్యాయని చెప్తే అమ్మ డాక్టర్ దగ్గరికి తీసుకెళ్తాను రమ్మంది. ఇవాళ శుక్రవారం. రేపూ ఎల్లుండీ సెలవు కదా.. వుండాలనిపిస్తే అమ్మ దగ్గరే వుండొచ్చని యివాళ పెట్టుకున్నానీ ప్రోగ్రాం. మనోహర్‌ని కూడా ఆఫీసునించి అక్కడికే రమ్మని చెప్పాను.

ఇంట్లోకి అడుగుపెడుతూండగానే అమ్మ నన్ను పరీక్షగా చూసి "అదే కారణం." అంది నవ్వుతూ. "తల తిరగడాలు... కళ్ళు తిరగడాలు కూడా అందుకే."

ఆ మాటలు వినగానే నాకు కంగారు ఎక్కువయింది.

అమ్మ సంతోషంగా ఏదో చెప్పబోతే... "సర్లే. వుండు. అంత ఆనందపడకు. ఒకవేళ నిజమైనా కూడా కంటిన్యూ చేస్తానో లేదో! అన్నాను.

అమ్మ నివ్వెరపోయి "అదేమిటి?" అంది.

వచ్చేముందు వినీత్ ఏమన్నాడో చెప్పి "అలాంటి అవకాశం వస్తే ... యిబ్బంది అవుతుంది కదా!" అన్నాను.

అమ్మ ఏమనాలో అర్థం కానట్లు చూసి "సరే ముందు డాక్టర్ దగ్గరికి వెళ్దాం పద." అంది.

వెళ్ళాం. ఆవిడ మేమనుకున్న విషయాన్నే నిర్ధారణ చేసింది.

నా గుండెదడ ఎక్కువయింది.

డాక్టర్ వ్రాసిన మందులు కొనేందుకు అమ్మ మెడికల్ షాపు వైపు నడుస్తుంటే "వుండు. ఇంటికెళ్ళి ఆలోచించుకున్నాక కొనచ్చు." అన్నాను.

ఇంటికి వచ్చాం. ఎనిమిదవుతూండగా మనోహర్ వచ్చాడు. డాక్టర్ చెప్పిన వార్తా, దాని గురించి నా ఆలోచనా.. రెండూ ఒకేసారి చెప్పాను. తనేం మాట్లాడలేదు.

అమ్మ అన్నం వడ్డించి పిల్చేవరకూ టి.వి. చూస్తూ కూర్చున్నాను.

అన్నం తిని పడుకున్నాక, సీలింగ్ వైపు చూస్తూ ఆలోచిస్తుంటే... "ఎక్కువ ఆలోచించకు. నీకేం చేయాలనిపిస్తే అది చేయి." అన్నాడు మనోహర్.

అవును. నిర్ణయం నాదే. ఈ విషయంలో నన్నెవరూ ఫోర్స్ చేయరు. నాకు సలహాలిచ్చేంత అధికారం అటు అమ్మానాన్నలకి కానీ.. యిటు మనోహర్‌కి కానీ యివ్వలేదు నేను.

నిజానికి యిపుడే పిల్లలు వద్దని నేనేమీ అనుకోలేదు. ఇవాళ సాయంత్రం వరకూ కూడా అది నిజమయితే బాగుండునన్న ఆలోచనే వుంది.

కానీ యిపుడు ఈ సమస్య. ఆన్‌సైట్‌కి వెళ్ళి ఒక సంవత్సరం వుంటే చాలా నేర్చుకోవచ్చు. ఇపుడీ అవకాశం వదిలేస్తే కెరీర్ పరంగా చాలా యిబ్బంది అవుతుంది.

ప్రక్కకి తిరిగి పడుకుంటుంటే.. 'నచ్చినవి చేసే క్రమంలో కూడా నచ్చనివి చేయాల్సి వస్తుంది' అన్న ప్రియ మాటలు గుర్తొచ్చాయి.

మొట్టమొదటిసారి మనసుకు నచ్చిన ప్రతిదీ చేయడం సాధ్యం కాదేమోనన్న సందేహం కలిగింది. అమ్మనవడం, అమెరికా వెళ్ళడం.. రెండూ కుదరవు. రెండిట్లో ఏదో ఒక విషయంలో నేను మనసుకు నచ్చ చెప్పుకోవాలి.

ఎందుకు కుదరదు! ఒకవేళ కుదురుతుందేమో! అమ్మని కూడా నాతోపాటు తీసుకువెళ్తే సరి. కానీ నాన్నని వదిలి అమ్మ వస్తుందో రాదో! మొట్టమొదటిసారి ఆన్‌సైట్‌కి వెళ్తే చాలా హార్డ్‌వర్క్ చేయవలసి వుంటుంది. ప్రెగ్నెన్సీతో అంత వర్క్ తను చేయగలుగుతుందా! ఒకవేళ తాను చేయాలనుకున్నా.. వినీత్‌కి ఆ నమ్మకం వుంటుందా! "నీకు కష్టమవుతుందేమో! ఇంకెవరినైనా పంపుతాలే." అంటాడు డెఫినెట్‌గా. ఉహు. అది కుదిరే పనికాదు.

సరిగా నిద్రపట్టక ముందే తెల్లవారింది. మనోహర్ అమ్మ పెట్టిన దోసెలు తిని, ఆఫీసులో కొంచెం పనుందంటూ వెళ్ళిపోయాడు సెలవైనా కూడా.

ఇంటి దగ్గరున్న గుళ్ళో ఏదో ప్రవచనం వుందట. ఓ గంటసేపు వెళ్ళొస్తానంటూ అమ్మ కూడా బయల్దేరింది.

నాకు మనసులో ఏదో దిగులుగా అనిపించింది. అమ్మని వదిలిపెట్టి వుండాలనిపించలేదు. "నేనూ వస్తాను పద." అన్నాను.

అయిదు నిమిషాలు నడిచి వేంకటేశ్వరస్వామి గుడికి చేరాం. దర్శనం చేసుకుని

యివతలికి వస్తూంటే ప్రియ కనిపించింది. అమ్మకి పరిచయం చేశాను. ముగ్గురం ఒకే చోట కూర్చున్నాం.

ప్రవచనం మొదలయింది. అమ్మ శ్రద్ధగా వింటోంది. ఆమె వయసుకు అది సహజమే. కానీ ప్రియ మరీ శ్రద్ధగా వింటోంది. తన భక్తుడి కోసం ఒక రథసారథిగా మారిన కృష్ణుడి వాత్సల్యాన్ని ఆయన వర్ణిస్తుంటే.. కళ్ళలో నుంచి నీళ్ళు కారిపోతూండగా వింటోంది ప్రియ. ఆమె మొహంలో కనబడుతూన్న వెలుగుని నివ్వెరపోయి చూశాను నేను.

మేమందరం పరుగులు తీసే సందర్భాలలో తాపీగా నడిచే ప్రియ.. ఏ విషయం పట్లా ఆరాటమూ, ఆసక్తీ లేనట్లుగా వుండే ప్రియ... ఒక పాత కథ, అందరికీ తెలిసిన కృష్ణుడి కథ విని అంతగా కదిలిపోవడం చూస్తే చాలా ఆశ్చర్యంగా అనిపించింది.

శ్రోతలందరినీ ఒకసారి పరికించి చూశాను. చాలామంది మొహాలలో అదే ఆనందం, పరవశం కనిపించాయి.

"దేవుడి గురించి చెప్తూంటే కొంత మంది మామూలుగా వింటారు. ఇంకొంతమంది చాలా పరవశించిపోతారు. ఎందుకని!" గుడిలోనుంచి యివతలికి వస్తూండగా ప్రియ దగ్గర నా సందేహం బయటపెట్టాను.

"భావనాశక్తి ఒక్కొక్కరికి ఒక్కోరకంగా వుంటుంది కదా!" అంది.

"భావనాశక్తంటే!"

"కనబడనిదాన్నీ, వినబడనిదాన్నీ.. ఊహించుకోవడం." మా సంభాషణ వింటున్న అమ్మ టకీమని జవాబు చెప్పింది.

అవునా! అన్నట్లు చూశాను నేను ప్రియ వైపు.

ప్రియ తల వూపుతూ "నిజమే. ఇంద్రియాలకు అందనిదాన్ని పట్టుకునే ప్రయత్నం చేసిన వాళ్ళకి అలాంటి ఆనందమే కలుగుతుంది." అంది.

"ఎలా వస్తుంది ఆ శక్తి!" ఆసక్తిగా అడిగాను.

"పూర్వజన్మ పుణ్యం." అమ్మ మళ్ళీ తడుముకోకుండా చెప్పేసింది.

అమ్మ సమాధానానికి పరిహాసంగా నవ్వుతూ 'మీరు చెప్పండి' అన్నట్లు ప్రియవైపు చూశాను.

ప్రియ తనలో తనే ఆలోచించుకుంటున్నట్లూ... "ఇంద్రియానుభవాలు తగ్గించుకోవడంవల్ల వస్తుందేమో!" అంది.

"అంటే... మనోనిగ్రహం వల్లనా!"

"అంతేగా మరి!" మళ్ళీ తేల్చేసింది అమ్మ.

అమ్మ ప్రియతో వెళ్ళొస్తామని చెప్పి యింటివైపు నడుస్తుంటే.. నేను మాత్రం ప్రియ దగ్గరే నిలబడిపోయి "మనసుని నిగ్రహించడంవల్ల ఒత్తిడి పెరగదా ప్రియా!" అన్నాను విషయమేమిటో తెల్చుకోవాలన్నట్లు.

"ఈ విషయమే కదా మాట్లాడుకున్నాం మనం నిన్న క్యాంటీన్‌లో!" అంది ప్రియ.

"మాట్లాడుకున్నాం కానీ.. నాకింకా సందేహంగానే వుంది." అన్నాను.

"నువు మనసుని నిగ్రహించే ప్రయత్నం చేస్తావా!" ప్రశ్నించింది ప్రియ.

"చేయను. నేనెప్పుడూ నా మనసు ఏం కోరితే అది చేస్తాను." అన్నాను.

"మరి నీకు ఒత్తిడి వుందా!"

ఉలిక్కిపడ్డాను నేను. లేదని ఎలా చెప్పను! నా కళాకళలు.. చిరాకులు.. నాకూ తెలుసు. ప్రియకీ తెలుసు.

"నిగ్రహానికీ, ఒత్తిడికీ సంబంధం లేదు జయంతీ! నిగ్రహం లేకపోవడం అంటే మనసు ఇంద్రియాలకు లోబడిపోవడం. నిగ్రహం వుండటమంటే బుద్ధిని అనుసరించడం. మొదటిది బానిసత్వమయితే రెండోది గురు శుశ్రూష లాంటిది. పైపైన చూస్తే.. మొదటి దాంట్లో చాలా స్వేచ్ఛ వున్నట్లూ... రెండో దాంట్లో ఒత్తిడి వున్నట్లూ అనిపిస్తుంది. కానీ కాస్త పరీక్షగా చూస్తే మనకే అర్థమవుతుంది - అది నిజానికి పూర్తిగా విరుద్ధమైన పరిశీలన అని."

ప్రియ మాటల్ని ఆశ్చర్యంగా విన్నాను నేను. ఇప్పటివరకూ నేను వింటూ వస్తున్న సిద్ధాంతాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తోంది ప్రియ!

నాకళ్ళల్లోని ప్రశ్నలన్నిటినీ చదివినట్లుగా ప్రియ మళ్ళీ చెప్పసాగింది.

"చపలత్వంతోనూ, కోరికలతోనూ సాంగత్యం చేసే మనసు.. ఇంద్రియాలకు బానిస అయిన మనసు.. క్రోధానికీ, లోభానికీ కారణమవుతుంది. అలాంటి మనసుని అనుసరించే బుద్ధి మన స్వేచ్ఛని హరించి మన చుట్టూ సంకెళ్ళని బిగిస్తుంది. అసలు 'ఆనందం' అంటే ఏమిటో కనీసం అర్థమైనా చేసుకోలేని స్థితికి చేరుస్తుంది. అలా కాకుండా బుద్ధిని సత్సాంగత్యపు నీడలో నిలిపి, ఆ బుద్ధి వెనుక మనసుని నడిపిస్తే.. మన స్వేచ్ఛని హరించేవీ, ఒత్తిడిని పెంచేవీ.. అన్నీ వాటంతట అవే తమ ఉనికిని కోల్పోతాయి. ఆనందం తప్ప మిగిలినవన్నీ మనల్ని వదిలిపెట్టి వెళ్తాయి."

మంత్రం వేయబడినదానిలాగా నేను ప్రియ కళ్ళల్లోకి చూస్తూ నిల్చుంటే.. "మీ అమ్మగారు వెయిట్ చేస్తున్నట్లున్నారు." అంది ప్రియ, పదడుగుల దూరంలో ఆగిన అమ్మని చూసి.

"మీరిలా మాట్లాడటం నేనెపుడూ వినలేదు. మీకింత స్పష్టమైన అభిప్రాయాలు వున్నాయి కదా! అయినా ఎందుకు ఎపుడూ ఎవరికీ ఏమీ చెప్పరు?" అన్నాను.

"తెలుసుకోవాలన్న ఆసక్తితో అడిగినవారికి చెప్పచ్చుకానీ, అందరికీ ఎందుకు జయంతీ చెప్పడం!" అంది ప్రియ.

"మరి నిన్న కిషోర్‌కి చెప్పారుగా మెయిల్‌లో!"

"అదా!" ప్రియ మళ్ళీ నవ్వింది. "అది తప్పలేదు. అతను ఆ మెయిల్ నాకు కాపీ చేశాడు కదా! నేను మాట్లాడకుండా వూరుకుంటే అతన్ని సమర్థించినట్లు అవుతుంది. టీమ్‌కి మేనేజర్‌గా వుండి నేను స్పందించకపోవడం కరెక్ట్ కాదు కదా!"

"ఇందాక మీరు చెప్పింది బాగా అర్థం కాలేదు ప్రియా. కానీ ఆలోచించవలసిన విషయం అనిపిస్తోంది." అన్నాను.

తనకి బై చెప్పి వడివడిగా అమ్మ వైపు నడిచాను.

ఇంటికి రాగానే అమ్మ నాకు మంచినీళ్ళిచ్చి.. "అన్నం పెట్టేస్తానుండు." అంటూ వంటగదిలోకి వెళ్ళింది.

ఫ్యాన్ వేసుకుని, సోఫాలో కూర్చుని కళ్ళు మూసుకుంటే... ప్రియ మాటలన్నీ మరోసారి వినబడ్డాయి. వినీత్, కిషోర్, నేనూ... మా అందరి ధోరణీ కళ్ళముందు మెదిలింది.

మనసు అడిగిన ప్రతిదీ అందించడమే సామర్థ్యమనుకుని, దాని సేవలోనే యిరవైనాలుగు గంటలూ మునిగిపోవడం.. మా మాటలూ, చేతలూ మా చెప్పుచేతల్లో లేవని గ్రహించకుండా, మా మనసేం చెప్తే అది చేస్తున్నామని మురిసి పోవడం.. ట్రాఫిక్ బాధలనుంచి పిల్లల్ని కనడం దాకా ప్రతీ విషయానికీ తల్లడిల్లిపోతూ కూడా, ఒత్తిడికి దూరంగా బతకడం చేతనయినట్లు ప్రగల్భాలు పలకడం.. !!

ఆలోచిస్తూంటే...

ప్రియ మాటలు నాకు మెల్లమెల్లగా అర్థమవుతున్నాయి. బయటి పరిస్థితులు బ్రహ్మాండంగా వున్నా.. మా మనసొక్కటీ చాలు మమ్మల్ని ఏడిపించి చంపడానికి... ఖర్మ

కాలి... పరిస్థితులు కూడా కాస్త వ్యతిరేకంగా మారాయా.. ఇంక వాటిల్ని ఎలా హ్యాండిల్ చేయాలన్న క్లూ కూడా మాదగ్గర లేదు.

బాధ్యతలనుంచి పారిపోయి.. చేతులెత్తేసి.. 'రిలాక్సేషన్' మంత్రాన్ని జపించడం.. అదొక్కటే మాకు తెలిసిన టెక్నిక్.

అమ్మ అన్నం వడ్డించేసరికి మనోహర్ కూడా వచ్చాడు. అన్నానికి కూర్చోబోతూ "అమ్మా! నిన్న డాక్టర్ వ్రాసిన మందుల చీటీ యిస్తావా మనోహర్‌కి!" అన్నాను.

అమ్మ వడ్డించడం ఆపేసి ఆశ్చర్యంగా చూసింది. "ఏంటి! మనసు మార్చుకున్నావా! ఎందుకు!" అంది.

"అవునమ్మా. మార్చుకున్నాను. ఆఫ్టరాల్ అది నా మనసు. నేను చెప్పినట్లు వినడం దానికి మంచిది కానీ దానికి నచ్చినట్లు చేయడం నాకు కాదు." గంభీరంగా చెప్పబోయినా నా గొంతులో అల్లరి ధ్వనించింది.

మనోహర్ కళ్ళు మెరిశాయి. "అంటే ఏమిటి? ఇకనుంచి అన్నీ మనసుకి నచ్చని పనులే చేయబోతున్నావా!" పరిహాసంగా అడిగాడు.

"కాదు." ఫక్కున నవ్వుతూ చెప్పాను. "మనసుకు నచ్చినవే చేస్తాను. కాకపోతే దానికి నచ్చాల్సిన పనులేమిటో మొదట నన్నడిగి తెలుసుకోమంటాను."

"ఏమిటే! ఉన్నట్లుండి నీ బుద్ధి యిలా మారిపోయింది!" అయోమయంగా చూస్తూ అడిగింది అమ్మ.

నేను ఆనందంగా నవ్వాను. "అవును. మారిపోయింది. ఒక మంచి గురువుని ప్రేమించడం మొదలుపెట్టింది." ప్రియ ప్రశాంతమైన చిరునవ్వు కళ్ళముందు మెదుల్తూండగా చెప్పాను.

**- సాహితీస్రవంతి**

*నవంబర్-డిసెంబర్ 2011*

*('కథకి నీరాజనం' 2011లో ఎంపికైన కథ)*